క్లుప్తంగా

రేపటి నుంచి నవరాత్రి మహోత్సవాలు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామ సమీపంలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రంలోని వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 26వ తేదీ నుంచి జూలై ఐదు వరకు జరుగుతాయని ఆలయ ఈవో హరిదుర్గా నాగేశ్వరరావు మంగళవారం పేర్కొన్నారు. దాదాపు పది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు, మూలమంత్ర హోమాలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ



నందిగామ రూరల్: మండలంలోని అడవిరావులపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరైన విద్యా కానుక కిట్‌లను ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశివంచుకని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ దాసరి రమేష్, ఉపాధ్యాయులు బెనర్జీ, రమణ, గ్రామ నాయకులు సూరా కొండలరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతుల హర్షం



వత్సవాయి: అన్నదాతలు సోమవారం రాత్రి కురిసిన వర్షంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వారం క్రితం నాటిన పత్తి విత్తనాలు మొలిచి వర్షం లేక ఎండిపోతుండడంతో రైతులు దిగాలు చెందారు. ఈ క్రమంలో పడిన వర్షం రైతులకు వరంగా మారింది. అంతేకాకుండా వర్షం పడడంతో మంగళవారం కూడా పెద్ద సంఖ్యలో రైతులు పత్తి విత్తనాలను నాటారు. భూమి పదును కావడంతో పత్తి విత్తనాలు బాగా మెలకెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు.

9న కార్మికుల దేశవ్యాప్త సమ్మె



కంచికచర్ల: కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వచ్చేనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు కోరారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద సీఐటీయూ నాయకులు పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంకు మంగళవారం కరపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను అమలు చేయటం లేదన్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, భవన నిర్మాణ రంగ కార్మికుల యూనియన్ 10వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష్యుడు వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి బెజ్జం భూషణం, పారిశుద్ధ్య కార్మికులు, బిల్డింగ్ వర్కర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ లక్ష్మీశను కలిసిన మునిసిపల్ కమిషనర్



జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశను మంగళవారం జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ డి.తులసి వెంకట కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జగ్గయ్యపేట పురపాలక సంఘానికి నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.

నారు మడులపై అవగాహన

ఆగిరిపల్లి: పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి భవాని అన్నారు. మంగళవారం బొద్దనపల్లి, కొత్త ఈదర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నారుమడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ నూతన సాగు విధానాల ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. వరి నాట్లు వేసే ముందు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

మొదలైన ఆధార్ కష్టాలు

- రోజుల తరబడి ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు
- క్యూలో వేచి ఉంటున్న ప్రజలు
- పోస్టాఫీసుల్లో పని చేయని సేవా కేంద్రం
- గతంకంటే ఆధార్ సేవా కేంద్రాలు తగ్గిపోవటంతో సమస్య



ఇండియన్ బ్యాంకు ఆధార్ సేవా కేంద్రంలో వేచి ఉన్న ప్రజలు

నందిగామ రూరల్: ఆధార్ కార్డు అప్డేట్ కష్టాలు తీరటం లేదు. ఆధార్ కార్డు అప్డేట్ విధానం ప్రజల సహనాన్ని పరీక్షిస్తోంది. ఆధార్ సేవా కేంద్రాలు తక్కువగా ఉండటంతో అప్డేట్ చేసుకునేందుకు రోజుల తరబడి సమయం పడుతుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 10 గంటల మధ్యలో టోకెన్‌లు ఇస్తున్నారని, రోజులో టోకెన్‌లు తీసుకున్న 30 మందికి మాత్రమే అప్డేట్‌కు అనుమతిస్తుండటంతో టోకెన్‌ల కోసం తెల్లవారుజామునే వచ్చి లైన్‌లో వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు

పట్టణంలోని ఇండియన్ బ్యాంక్, తపాలా శాఖ కార్యాలయం, మండలంలోని జొన్నలగడ్డ, లింగాలపాడు గ్రామాలలో మాత్రమే ఆధార్ సేవా కేంద్రాలున్నాయి. గతంలో ఒక్క నందిగామ పట్టణంలోనే ఆరు వరకు ఆధార్ కేంద్రాలుండేవి. కానీ నేడు పట్టణంలో రెండు, మండలంలోని 25 గ్రామాల పరిధిలో రెండు మాత్రమే ఉండటంతో ఆధార్ సేవల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

పేరుకు రెండు.. పని చేసేది ఒక్కటే..

నందిగామ పట్టణంలో రెండు ఆధార్ కేంద్రాలలో ఒక కేంద్రంలోనే సేవలందుతున్నాయి. పోస్టాఫీస్‌లో ఆధార్ సేవా కేంద్రం పని చేయటం లేదు. అడిగితే సిబ్బంది సెలవులో ఉన్నారని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. మరో నెల రోజుల వరకు ఈ ఆధార్ సేవా కేంద్రం పని చేయదని



పిల్లలతో ఆధార్ సేవా కేంద్రం వద్ద వేచి ఉన్న మహిళలు

కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని అంటున్నారు. పని చేసే ఒక్క కేంద్రంలో కూడా సర్వర్ బ్రేక్ అవుతుండటంతో పాటు పెనుగంచిప్రోలు మండలంలోని పరిసర గ్రామాల ప్రజలు కూడా ఇక్కడికే వస్తుండటంతో మరింత జాప్యం జరుగుతోంది.

పథకాలలో కోత పెట్టేందుకేనా?

ప్రభుత్వ సంక్షేమ పథకాలలో కోత పెట్టేందుకే ఆధార్ సేవలలో ప్రభుత్వం జాప్యం చేస్తుందనే అనుమానం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కేంద్రాల లైసెన్స్‌లకు రెన్యూవల్ చేస్తే ఒత్తిడి తగ్గుతుందని తెలిసినా ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోకపోవటమేంటని ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆధార్ సేవా కేంద్రాల సంఖ్యను పెంచి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో సచివాలయాల్లో సేవలు

గతంలో ఆధార్ సేవలందించిన కేంద్రాల లైసెన్స్ రెన్యూవల్ కాకపోవటంతోనే కేంద్రాలను నిలుపుదల చేశారు. వచ్చే సోమవారం నుంచి షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామ సచివాలయాలలో ఆధార్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సురేష్ బాబు, తహసీల్దార్, నందిగామ రూరల్

తెల్లవారుజాము 4 గంటలకే వచ్చా



ఆధార్ కార్డుకు ఫోన్ లింకు చేసుకునేందుకు వచ్చాను. నిన్న సోమవారం ఉదయం ఏడు గంటలకు వచ్చి క్యూలో ఉన్నా.. నా వంతు వచ్చే సరికి బ్యాంకు సమయం ముగిసింది. దీంతో మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు వచ్చి లైన్‌లో ఉన్నాను. దీనినిబట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

– బాబు సాహెబ్, నందిగామ

మా ఊళ్లో ఆధార్ కేంద్రం లేదు



మాది పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట. మా గ్రామంలో ఆధార్ సేవా కేంద్రం లేకపోవటంతో నందిగామకు వచ్చాను. ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింక్ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వస్తాయని చెప్పటంతో చంటి బిడ్డలతో వచ్చాను. ఇప్పుడు కుదరదు తరువాత రండి అని చెబుతున్నారు.

–ఉప్పులూరి ఎస్తేర్ రాణి, నవాబుపేట

పడిగాపులు తప్పటం లేదు



ఆధార్ కార్డులో పేరు తప్పుగా పడటంతో మార్చుకునేందుకు ఉదయాన్నే వచ్చాను. టోకెన్‌లు ఇస్తాం రోజుకు 30 మందికి మాత్రమే అని సేవా కేంద్రం సిబ్బంది చెబుతున్నారు. ఆధార్‌లో పేరు మార్చుకునేందుకు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– ఎర్రబండి సుధీర్, నందిగామ

మైనర్లు డ్రైవింగ్ చేస్తే బైక్‌లు సీజ్ చేస్తాం

ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు



అంబేడ్కర్ కూడలిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ, సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: ద్విచక్ర వాహనాలను (బైక్‌లు) మైనర్లు డ్రైవింగ్ చేస్తే సహించేది లేదని, వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు బైక్‌లు సీజ్ చేస్తామని పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని రైతుబజారు వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడలిలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, డాక్యుమెంట్లు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిని, పెండింగ్ చలానాలు కట్టాల్సిన వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరొకసారి మైనర్లు డ్రైవింగ్ చేస్తే బైకులు సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వీరులపాడు: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అనిల్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలో మంగళవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే వాహనాన్ని సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అనంతరం రికార్డులు సరిగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్లో చెట్ల కొమ్మలు తొలగింపు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 6వ వార్డు, కాకానినగర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న వేపచెట్ల కొమ్మలు ఎక్కువగా విస్తరించడంతో పాఠశాలలో తరగతి గదులు మూసివేస్తూ విద్యార్థులకు ఆటంకంగా మారాయి. దీంతో పాఠశాల హెచ్‌ఎం సమస్యను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ప్రభాకర్ మున్సిపల్ సిబ్బందిని పిలిపించి వేపచెట్ల కొమ్మలను నరికివేయించారు. పాఠశాల ఆవరణలో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలను శుభ్రం చేయించారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

జి.కొండూరు: వరకట్న వేధింపులపై జి.కొండూరు పోలీసులకు వివాహిత ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వెలగలేరుకు చెందిన మౌనికకు కొండపల్లికి చెందిన వల్లూరి సంపత్‌కుమార్‌కి మూడేళ్ల కిందట వివాహమైంది. వివాహ సమయంలో మౌనిక తల్లిదండ్రులు రూ.8 లక్షల నగదు, అల్లుడుకి ఏడు కాసుల బంగారం, కూతురుకి ఐదు కాసుల బంగారం కట్నంగా ఇచ్చి వివాహం జరిపించారు. వివాహ సమయంలో సంపత్‌కుమార్ బీటెక్ చదివి ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పాడు. కానీ వివాహం అనంతరం సంపత్‌కుమార్ బీటెక్ చదవలేదని, ఉద్యోగం సక్రమంగా చేయడం లేదని తెలిసింది. ఉపాధి కోసం మౌనిక తన తల్లిదండ్రులకు చెప్పి మరో రూ.2 లక్షలు ఇప్పించి భర్తకు కారు కొని ఇచ్చింది. మరో కారు కొనేందుకు రూ.3 లక్షలు తీసుకురావాలంటూ సంపత్‌కుమార్ మౌనికను వేధించడంతో మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



నందికట్ల కుందన వెంకట నాగశ్రీ సాయి



నందికట్ల కుందన వెంకట నాగశ్రీ



మహ్మద్ ముషీర



ఎస్‌కే రిజ్వానా



కే ఉదయ్ కుమార్

కంచికచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులు ఐఐఐటీలో సీటు సాధించారు. మంగళవారం వీరిని అభినందించారు. ఈమేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన నందికట్ల కుందన వెంకట నాగశ్రీ సాయి (587), నందికట్ల కుందన వెంకట నాగశ్రీ (584) మార్కులు సాధించటంతో నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని తెలిపారు. వీరిద్దరూ అన్నా చెల్లెళ్లు (కవలపిల్లలు). మహ్మద్ ముషీర (579) మార్కులు సాధించి ఒంగోలు ట్రిపుల్ ఐటీ చదివేందుకు ఎంపిక అయ్యారన్నారు. ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

ఇద్దరు విద్యార్థుల ఎంపిక

వత్సవాయి: ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు వత్సవాయి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.అనితశ్రీ మంగళవారం తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎస్‌కే రిజ్వానా (578), కే ఉదయ్‌కుమార్ (567) ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సెల్ టవర్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



సెల్ టవర్ పనులపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న స్థానికులు

జి.కొండూరు: స్థానికంగా ఆత్కూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్న సెల్ టవర్ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆత్కూరు రోడ్డు పక్కన మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి సమీపంలోని ప్రైవేటు భూమిలో గతంలో ఏర్పాటుచేసిన సెల్ టవర్ పక్కన మరో టవర్ ఏర్పాటుకు మంగళవారం పనులను ప్రారంభించారు. స్థానికులు అక్కడకు చేరుకుని పనులను నిలిపివేయాలని సిబ్బందిని కోరారు. స్థానికులు మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న సెల్ టవర్ రేడియేషన్‌తో తాము అనారోగ్యం పాలవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మరో టవర్‌ని ఏర్పాటు చేస్తే తాము ఇళ్లు వదిలి పోవాల్సి వస్తోందని మండిపడ్డారు. టవర్‌కి సమీపంలోనే ప్రైవేటు పాఠశాల కూడా ఉన్నందున రేడియేషన్ ఎఫెక్ట్‌తో విద్యార్థులంతా అనారోగ్యం పాలవుతారన్నారు. ఈ సమస్యపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సర్పంచ్ మండల అరుణ ఘటనా స్థలానికి చేరుకొని టవర్ ఏర్పాటుకు గ్రామ పంచాయతీలో తాము ఎటువంటి తీర్మానం చేయలేదని చెప్పారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు.

పగలే వెలుగుతున్న వీధిలైట్లు



బలుసుపాడు ఎస్సీ కాలనీలో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత 6 నెలలుగా వీధిలైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యమో లేక విద్యుత్ లైన్లలో ఉన్న లోపాలో కాని విద్యుత్ అయితే ఖర్చు అవుతూనే ఉంది. కాలనీలో సుమారు 20 వీధిలైట్లు పగలూ, రాత్రి వేళల్లో వెలుగుతూనే ఉన్నాయి. స్థానిక పాలకుల దృష్టికి తీసువెళ్లినప్పటికీ, వారు సమస్య పరిష్కారం వైపు దృష్టి పెట్టకుండా, ఫిర్యాదు చేసిన వారిపై గుర్రుగా ఉంటున్నారు. ఇప్పటికే ఈ సమస్యను మండల స్థాయి అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు స్పందించి పగలు వీధిలైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలని, దుబారా అయిన విద్యుత్ భారం ప్రజలపై పడకుండా చూడాలని కోరుతున్నారు.

సురేష్ కుటుంబానికి అండగా ఉంటాం



సురేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్, పక్కన జగన్మోహనరావు, తన్నీరు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): సురేష్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు అన్నారు. ఇటీవలన గుండెపోటుతో మృతి చెందిన గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యానాల సురేష్ కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. అనంతరం సురేష్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శివాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు జక్కులూరి దేవదాసు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, గ్రామ నాయకులు వూట్ల లక్ష్మయ్య, కోలా రామారావు, గంగూరి ప్రసాద్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు నిధులను కార్మికులకే కేటాయించాలి



మాట్లాడుతున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు

నందిగామ టౌన్: కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు నిధులు దుర్వినియోగం చేయకుండా కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏళ్ల తరబడి ఆందోళనలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పథకాలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిందని, అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూలై 30న విజయవాడలోని రామవరప్పాడులో జరిగే బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ 10వ జిల్లా మహాసభను కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ఉమామహేశ్వరరావు, డీవీ కృష్ణ, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కమల, కటారపు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీయూపీ స్కూళ్లను కొనసాగించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్



ఎంఈఓ బాలాజీనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కంచికచర్ల: మండలంలో వేములపల్లి, కొత్తపేట, పేరకలపాడు, చెవిటికల్లు ఎంపీయూపీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్ డిమాండ్ చేశారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేసి ప్రభుత్వం విద్యావ్యవస్థను నాశనం చేసేందుకు కుట్ర పన్నుతోందని గోపీనాయక్ అన్నారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ బాలాజీనాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గోపీనాయక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను తొలగించి విద్యా వ్యవస్థ వినాశనానికి కూటమి ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆకర్షించి ప్రలోభాలకు గురిచేస్తున్నారని, కార్పొరేట్ యాజమాన్యానికి కూడా విద్యాధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్ పాఠశాలల్లో రూ.10 వేల నుంచి రూ.80 వేల వరకు ఫీజులను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వ విద్యాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని మండిపడ్డారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను విలీనం పేరుతో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కలపటం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ షేక్ జాహిదా, మాధవ్, నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులు సరే.. మట్టి తొలగించేదెప్పుడు



పట్టణంలోని ముక్త్యాల రోడ్డుపై అడ్డంగా ఉన్న మట్టి కుప్పలు

జగ్గయ్యపేట: పట్టణంలో ముక్త్యాల రోడ్డులోని ప్రధాన తాగునీటి పైప్‌లైన్ ఇటీవల మరమ్మతులకు గురైంది. దీంతో మున్సిపల్ అధికారులు ప్రధాన రహదారిని 20 అడుగుల మేర తవ్వి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. అయితే మరమ్మతులు చేసి నాలుగు రోజులవుతున్నా మట్టి కుప్పలను తొలగించకపోవటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. తవ్విన మట్టిని రోడ్డుపైనే వదిలేశారు. ఆవులు కూడా రోడ్డుపైనే సేదతీరుతున్నాయి. మంగళవారం ఉదయం పాఠశాలలకు వెళ్తున్న నలుగురు విద్యార్థులు కింద పడి స్వల్ప గాయాలయ్యాయి. రద్దీగా ఉండే ప్రాంతంలో మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం మేలు

ముసునూరు: రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. రమణక్కపేట, లోపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎస్‌కేల వద్ద భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనా సేకరించే విధానం, భూసార పరీక్షల వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు. భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్ట విత్తనాలు, పీఎండీఎస్ కిట్ల రూపంలో ఉన్న నవధాన్యాలను చల్లుకొని పూత దశలో పంట చేనులో కలియదున్నాలన్నారు. వైస్ ఎంపీపీ కె.రాజానాయన, సర్పంచ్ ఆర్.ధనలక్ష్మి గాంధీ, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను దూషించారని ఫిర్యాదు

తిరువూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దూషిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్స్ పెట్టిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ నాయకులు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్‌ను, దళితులను కించపరుస్తూ ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో సుధీర్‌బాబు అనే వ్యక్తి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, రాజ్యాంగాన్ని సైతం అవమానించిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఎస్‌ఐ లక్ష్మీకి ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు తాళ్లూరి నవీన్‌కుమార్, చలమాల సత్యనారాయణ, లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి, తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఆంజనేయపురం, కొమ్మిరెడ్డిపల్లి గ్రామ సర్పంచులు మామిడి కుటుంబరావు, బంకా వెంకటేశ్వరరావు, చింతలపాడు మాజీ సర్పంచి బండారు పద్మావతి, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఇన్‌చార్జి యరదేశి రామారావు, మైనారిటీ నాయకులు షేక్ జాకీర్, నాయకులు పాల్గొన్నారు.